బర్త్ డే కానుక!

వాణిశ్రీ

నాకు సబ్ ఇన్ స్పెక్టర్ నుంచి సర్కిల్ ఇన్ స్పెక్టర్ గా ప్రమోషన్ వచ్చినందుకు ఆనందంతో వుప్పొంగి పోయాను. జీతంలో పెరుగుదల, హోదా తల్చుకుని వుక్కిరి బిక్కిరయ్యాను. ఇన్నాళ్ళూ నేను హెడ్ లను, కానిస్టేబుళ్ళను మాత్రమే హడలగొట్టేవాడిని. ఇక నుంచి కొందరు యస్. ఐ. లను కూడా దడదడ లాడిస్తాను.

అయితే నన్ను పోస్టుజేసిన వూరు చూసి నీరుకారి పోవాల్సి వచ్చింది. అది వీరకేసరి పురం.

ఆ వూరు పేరుకి తగినట్లే వుంటుంది. ఆ వూరి పేరు ఇండియా ప్రజలకు సుపరిచితమే. ఆ వూళ్ళో వీరులు ఎక్కువగా వుంటారనడానికి నిదర్శనంగా దోపిడీలు, హత్యలు తరచుగా జరుగుతూ వుంటాయి. అక్కడి ప్రజలకు రాజకీయ చైతన్యం ఎక్కువట. అందుకే ఆ తాలూకాలో గొడవలు ఎక్కువట.

అక్కడికి ట్రాన్సఫర్ చేస్తే పనిష్మెంట్ వేసినట్టే

అని మా డిపార్ట్‌మెంట్‌లో అనుకుంటారు. పోలీసు అధికారులు ఎవరూ అక్కడ వుండడానికి ఇష్టపడరు. ఏవేవో కుంటిసాకులు చెప్పి ట్రాన్స్‌ఫర్ కోసం ట్రై చేస్తుంటారు.

నేను ప్రమోషన్ మీద వెళ్తున్న వాడిని గనుక కొన్నాళ్ళు వుండక తప్పదు. తప్పదు గనుక బయల్దేరాను. అదృష్టవశాత్తు మా ఫాదర్ టౌన్‌లో ఇల్లు కట్టించి ఇచ్చిపోయాడు కాబట్టి, పిల్లల్ని కాలేజీలో చేర్పించి ఒంటరిగానే వీరకేసరిపురం బయల్దేరాను.

నాకు చార్జి ఇచ్చిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాకు పాత గురువే. నేను ఆయన క్రింద పనిచేశాను లోగడ.

"బ్రతికి పోయానోయ్!" అన్నాడు దీర్ఘంగా వూపిరి పీల్చుకుని.

"అయితే, నేను చచ్చానన్న మాట." అన్నాను నవ్వుతూ.

ఆయన గూడా నవ్వేశాడు.

ఇక ఏమాత్రం ఆలస్యం చెయ్యకుండా లారీలో సామాను వేసుకుని వెళ్ళిపోయాడు గురుడు ఫ్యామిలీతో సహా.

ఆ ఇంట్లోనే నేను దిగాను. ఒక్కడికే అంత ఇల్లు అనవసరమే అయినా హోటల్ భోజనం పడదు కాబట్టి వంటవాడిని పెట్టుకోవాలనుకున్నాను. ఆ ఏర్పాట్లన్నీ మావాళ్ళు చేసేశారు. తిరపతి అనేవాడిని వంటకు కుదిర్చారు. వయస్సు మళ్ళినవాడే అయినావంట బాగా చేస్తాడట.

ఆ ఏరియాలో యస్. ఐ. లు నన్ను కలుసుకుని పరిచయం చేసుకున్నారు. వీరకేసరిపురం తాలూకా కేంద్రం.

ఆ వూళ్ళో ఒక్కటే పోలీస్ స్టేషన్. అంగులో యస్. ఐ. కృష్ణమూర్తి పాత ఫ్రెండ్.

పేరుకి తాలూకా కేంద్రమేతప్ప మరుగుజ్జులా వుండి పోయింది వూరు. ఎలక్షన్స్ వచ్చినప్పుడు గొడవలు ఎక్కువట. ఆ వూళ్ళోకంటే చుట్టుప్రక్కల వూళ్ళల్లో జరుగుతుంటాయట రాజకీయ హత్యలు. అదంతా కృష్ణ మూర్తి చెప్పాడు.

"ప్రస్తుతానికి ఫరవాలేదు. ప్రశాంతంగానే వుంది. పంచాయితీ ఎలక్షన్స్ వస్తే మాత్రం మనం రిజర్వ్, సి. ఆర్. పి తెప్పించుకోవాల్సిందే." అన్నాడు కృష్ణ మూర్తి నవ్వుతూ.

అప్పుడు వుదయం తొమ్మిది గంటలైంది. నేను చార్జ తీసుకుని ఇరవై నాలుగు గంటలు కాలేదు.

కృష్ణమూర్తి నవ్వుతూనే వున్నాడు.

టెలిఫోన్ ఏడ్చింది.

రిసీవర్ ఎత్తి "పోలీస్ స్టేషన్ ప్లీజ్!" అన్నాను.

"కొండయ్యగారేనా?" ప్రశ్నించింది అవతల కంఠం.

"కాదు."

"మరి ఎవరు?"

"ఆయన నిన్ననే వెళ్ళిపోయాడు. నేను క్రొత్త సర్కిల్ ఇన్‌స్పెక్టర్ని."

"నమస్కారం సార్!" అంది అవతలి కంఠం.

"నమస్కారం. ఎవరు మీరు?"

"నా పేరు ప్రతాపరాయుడు సార్. జమీందారుగారి అబ్బాయిని."

"అలాగా!"

"కొండయ్యగారు నాకు ఫ్రెండ్."

"అలాగా!"

"మిమ్మల్ని కలుసుకోవడానికి వస్తాను. స్టేషన్లో వుంటారు కదా!"

"ఉంటాను. ఏమైనా పనా?"

"పనేం లేదు సార్! ఏమీ తోచక. మీరిప్పటికే తెలుసుకుని వుండాలి. ఈ వూళ్ళో చదువుకున్న వాళ్ళకి ఏమీ తోచదు. అందుకే వున్న కొద్దిమందితో కాలక్షేపం చేస్తుంటాను."

'పాపం' అనుకున్నాను.

"ఎవరీ ప్రతాపరాయుడు. ఫోన్లోనే బోర్ కొట్టేస్తున్నాడు?" అన్నాను నవ్వుతూ.

"ఒకప్పుడు ఈ ఏరియా జమీందార్ల క్రింద వుండేది. ఆ వంశం వాళ్ళు ఇంకా ఇక్కడే వున్నారు. నరసింహరాయుడని జమీందారు వున్నాడు. పక్షవాతం వచ్చి మూల పడ్డాడు లెండి. ఆయన ఏకైక కుమారరత్నం ఈ ప్రతాపరాయుడు. కొంచెం క్రాక్ లూజు. అయితేనేం మనకి కాలక్షేపం." అంటూ నవ్వాడు కృష్ణమూర్తి.

ఇంతలో ఎవరో అతను వచ్చి విష్ చేసి నిల్చున్నాడు.

"ఏమిటి?" ప్రశ్నించాను.

"నా పేరు రామారావు సార్!"

"వూఁ...."

"సెంటర్లో వెల్‌కమ్ హోటల్ నాదే."

"ఏం కావాలి?" విసుగ్గా అన్నాను.

"మా నాన్న కన్పించడంలేదు సార్!" విచారంగా అన్నాడు రామారావు.

"ఏం? మతిస్థిమితం లేదా?"

"వుహూఁ.... బాగానే వున్నాడు సార్."

"మరింకేమిటి? ఇంట్లో ఏదైనా గొడవ పెట్టుకున్నారా?"

"అటువంటిది ఏమీ లేదు సార్!"

"ఏమీ లేకపోతే ఎక్కడికి పోతాడు? ఎందుకు పోతాడు? చిన్నపిల్లవాడా తప్పిపోవడానికి." అన్నాడు కృష్ణమూర్తి.

"ఎప్పట్నుంచి కన్పించడంలేదు?" ప్రశ్నించాను.

"మొన్న రాత్రి ఇంటికి రాలేదు. వస్తాడులే అని వూరుకున్నాను. రాత్రివరకూ రాకపోతే అనుమానం వచ్చింది. ఎందుకైనా మంచిదని మీకు రిపోర్టు ఇవ్వాలని వచ్చాను." అన్నాడు రామారావు.

"కూర్చుని రిపోర్టు రాసివ్వు." అన్నాను.

అతను రిపోర్టు రాసిచ్చాడు.

వాళ్ళ నాన్న పేరు గోపయ్య. వయస్సు అరవై వరకు వుంటాయి. పొడుగ్గా వుంటాడు. తెల్లటి పంచె, లాల్చీ వేసుకుని వుంటాడు.

"ఫోటో వుందా?"

తల వూపాడు రామారావు.

"ఒకటి పంపిస్తే మంచిది." అన్నాను.

"అలాగే పంపిస్తాను సార్. మీరు దయచేసి మా నాన్న ఏమయ్యాడో చూడాలి సార్." అన్నాడు.

"సరే...." అన్నాను విసుగ్గా.

రామారావు వెళ్ళిపోబోతుంటే స్టేషన్ బైట జీప్ ఆగిన శబ్దం వినిపించింది.

అ వచ్చిన కుద్రాడు రామారావుని పలకరించి లోపలకు వచ్చి నాతో కరచాలనం చేసి "గ్లాడ్ టూ మీట్ యూ సార్." అన్నాడు.

"ఇతనే సార్ ప్రతాపరాయుడు. పిల్లజమీందారు." నవ్వుతూ అన్నాడు కృష్ణమూర్తి.

"భలేవాళ్ళు సార్! జమీందారులు పోయి ఎంత కాలమైంది. మేం పేరుకే జమీందారులం." అన్నాడు.

నేను అతన్ని పరీక్షగా చూశాను.

ఎర్రగా ఎత్తుగా వున్నాడు. పాతికేళ్ళు పైనే వుంటాయి అతనికి. హిప్పీక్రాపు, సైడ్ లాక్స్‌తో అప్టూడేట్‌గా డ్రెస్ చేసుకుని చలాకీగా మాట్లాడుతున్నాడు. కృష్ణమూర్తి చెప్పినట్లుగా కొంచెం వాగుడు ఎక్కువే. తనకు అనవసరమైన వాటిలో కూడా తలదూర్చేలా అనిపించాడు.

"రామారావు వచ్చాడెందుకు సార్!" అన్నాడు ఎంతో చనువుగా.

నాకు చిరాకు పుట్టింది. అవన్నీ ఇతనికెందుకు అనుకున్నాను. అందుకే చెప్పలేదు.

"వాళ్ళ నాన్న మొన్నట్నుంచి కన్పించడంలేదట. రిపోర్టు ఇవ్వడానికి వచ్చాడు." అన్నాడు యస్. ఐ. కృష్ణమూర్తి.

"ఎవరూ ఆ ముసలాశు గోపయ్యా!" అంటూ ఆశ్చర్యం వెలిబుచ్చాడు.

"ఆ ముసలాడు అసాధ్యుడు సార్! ఎక్కడికి పోతాడు?" అన్నాడు ప్రతాపరాయుడు.

"మీకు పరిచయం వుందా?"

"లేకపోవడం ఏమిటి సార్? చెప్పగూడదుగాని ఆ ముసలాడు గుడిని....అందులో లింగంతో సహా మింగేసే రకం...."

"అలాగా?"

"నా చిన్నప్పుడు, మా కోటలో పనిచేసేవాడు సార్. అన్నం పెట్టి పాతిక రూపాయలు జీతం ఇచ్చేవాడు మా నాన్న."

"ఐ.... సీ...."

"అటువంటి వాళ్ళ ఫామిలీ ఈరోజు ఏ పొజిషన్‌లో వుంది?"

"మీరే చెప్పండి?"

"మీకు క్రొత్త. తెలీదు గదా! నేనే చెప్తాను. కృష్ణ మూర్తిగారికి తెలిసి వుండొచ్చు." అన్నాడు.

"నో.... నో.... నాకూ పెద్దగా తెలీదు. మీరే చెప్పండి." అన్నాడు కృష్ణమూర్తి.

"మెయిన్ బజార్లో బస్టాండు ఎదురుగా వెల్‌కమ్ హోటల్ వుంది. అది వాళ్ళదే. రోజుకు వెయ్యి రూపాయలు అమ్ముతుంది."

"వూఁ...."

"పాత పెంకుటిల్లు పడగొట్టించి రెండంతసుల మేడ కట్టించాడు. లక్షకు తక్కువ చెయ్యదు. పాతిక ఎకరాలు మాగాణీ కొన్నాడు. అదిగాక పది ఎకరాల మామిడి తోట...."

"ఎలా సంపాదించాడు?"

"చెప్పాను గదా సార్! అసాధ్యుడని. పాతికేళ్ళ క్రితం పాతిక రూపాయల జీతంతో బ్రతికినవాడు ఇంత ఆస్థి సంపాదించాడంటే ఆ ముసలాడి బ్రెయిన్ ఎంత గొప్పదో గదా! అటువంటివాడు తప్పిపోవడం ఏమిటి సార్!" అంటూ నవ్వాడు ప్రతాపరాయుడు.

"మరి ఎక్కడికి పోయివుంటాడు?" ప్రశ్నించాను.

"ఈ మధ్య ఆ ముసలాడు ఎక్కువగా త్రాగుతున్నట్లు

తెలుస్తోంది. ఇంట్లో గొడవలవల్లనట. విరక్తి పుట్టి త్రాగి త్రాగి ఎక్కడైనా హరీ అన్నాడేమో?"

"వాట్?" ఆశ్చర్యపోయాను ప్రతాపరాయుడు అంత ఖచ్చితంగా చెప్తుంటే.

"త్రాగి రోడ్డుప్రక్కన పడిపోయివుంటే నా జీప్‌లో వేసుకుని ఇంట్లో జేర్చాను ఎన్నోసార్లు. తర్వాత చెప్పాను గూడా ఎప్పుడో అలాగే దిక్కులేని చావు చస్తావని." అన్నాడు.

"మరి ఇదంతా అతని కొడుకు చెప్పలేదే?" సందేహంగా అన్నాను.

"ఎందుకు చెప్తాడు సార్? ఈ మధ్య తండ్రికి కొడుక్కీ పడటంలేదు. ఈ ముసలాడు చావడన్నా చావడేమని విసుక్కుంటున్నాడు గూడా. అసలు కొడుకే చావగొట్టి పారేసి మీకు రిపోర్టు ఇచ్చాడేమోనని నా అనుమానం." అన్నాడు ప్రతాపరాయుడు.

నేను ఆశ్చర్యంతో నోరు తెరుచుకున్నాను. కృష్ణమూర్తి మతిపోయిన వాడిలా చూస్తున్నాడు గుడ్లప్పగించి. ఆ సమయంలో ఆ పిల్లజమీందారు మాకు డియస్పీలా కన్పించాడు.

"సరే సార్! ఆ గొడవలో పడి అసలు సంగతి మర్చిపోయాను. ఈ రాత్రి డిన్నరు మా ఇంట్లోనే మీకు." అన్నాడు.

"ఎందుకూ?" అన్నాను.

"ఎందుకేమిటి సార్! మీరు ఈ వూరు వచ్చిన సందర్భంలో అనుకోండి. ఏమంటారు కృష్టమూర్తి గారూ! అసలు డిన్నర్‌కి రావడానికి ఒక సందర్భం అంటూ వుండాలని రూల్ ఏమన్నా వుందా ఏమిటి?" అన్నాడు.

యస్. ఐ. చిరునవ్వు నవ్వి వూరుకున్నాడు.

నేనేమో ఇబ్బందిగా కదిలాను కుర్చీలో. అసలే ఈ ఏరియాలో రాజకీయాలు రావణ కాష్టాలు. ఈ పిల్ల జమీందారు ఏ పార్టీయో, ఏ వర్గమో, ఎవరి ముఠానో, ఇతనితో క్లోజ్‌గా వుంటే ఏమేమి అనర్థాలు జరుగుతాయో! ఎవరెవరికి పుండుమీద కారం పడుతుందో? ఏ నాయకుడి ఆగ్రహానికి గురికావలసి వస్తుందో?

అదంతా ఆలోచించి డిన్నర్‌కి ప్రస్తుతానికి రానని ఏవేవో కుంటిసాకులు చెప్పి, ఆ పిల్లజమీందారుని డిస్పోజ్ చేసేసరికి నా తల ప్రాణం తోకకి వచ్చింది.

2

మధ్యాహ్నం భోజనం చేసి స్టేషన్‌కెళ్ళి పాత రికార్డులు తిరగేస్తూ కూర్చున్నాను ఆ ఏరియాలో క్రైమ్స్ ఎలా వుంటాయో తెలుసుకోవడానికి.

హెడ్‌కానిస్టేబుల్ ఎవర్నో పట్టుకొచ్చి ఎదుట నిలబెట్టాడు. ఎవరో ముసలోడు. నన్నుచూసి రెండుచేతులూ ఎత్తి నమస్కారం చేశాడు.

"ఎవరు నువ్వు?"

"రుద్రయ్యపాలెం వెట్టోణ్ని అయ్యా!" అన్నాడు.

"ఏమిటి?"

"మునసబు నాయుడు పంపారయ్యా!" అంటూ ఒక చీటీ అందించాడు.

అది చదివి తల చేత్తో పట్టుకోవాల్సి వచ్చింది. ఆ వూరి శివార్లలో ఒక పాడుబడిన బావిలో శవం తేలిందట.

"రుద్రయ్యపాలెం ఎక్కడ?" హెడ్‌ని అడిగాను.

"దగ్గరే సార్. ప్రక్కవూరే."

"ఎంత దూరం వుంటుంది?"

"నాలుగు మైళ్ళు వుంటుంది సార్!"

"జీప్ వెళ్తుందా?"

"ఎండాకాలం వెళ్తుంది సార్?."

"ఇది ఎండాకాలమే గదా?"

"అవును సార్!"

"మరి జీప్ వెళుతుంది గదా!"

"వెళుతుంది సార్!"

"మరి ఆ సంగతి ముందే చెప్పకుండా అతి తెలివి చూపిస్తావేం?" అని లెఫ్ట్ రైట్ ఇచ్చాను హెడ్‌కి.

అతని ముఖం నయాపైసా అంత అయింది. నాకు చిరాకు ఇటువంటి డొంకతిరుగుడుగాళ్ళంటే.

"యస్. ఐ. ఏడి?"

"ఇంకా రాలేదు సార్!"

"వెళ్ళి పిలుచుకుని రా. అర్జెంట్. మర్డర్ కేస్ అని చెప్పు."

హెడ్ పరిగెత్తాడు.

కృష్ణమూర్తి హడావుడిగా వచ్చాడు. రాగానే రుద్రయ్యపాలెం మునసబు పంపిన రిపోర్టు చూపించాను.

"ఒకవేళ ఆ శవం ఆ గోపయ్యదేమో?" సందేహం వెలిబుచ్చాడు.

నాకా ఐడియా రానేలేదు. నిజమే అతని కొడుకుని గూడా తీసికెళ్తే గొడవ వదిలిపోతుంది అనిపించింది. రుద్రయ్యపాలెం పోతూ దార్లో రామారావుని ఎక్కించుకుని వెళ్ళాం.

మేం వెళ్ళేసరికి పూరిజైటే వున్నారు జనం. లావుగా పొట్టిగా వున్నాయన మునసబు నాయుడట. పరిచయం

చేసుకున్నాడు. ఇంకా వూరి పెద్దలు కొందరు వున్నారు.

అక్కడికి దగ్గర్లోనే వుంది పాడుబడిన శవం. వెళ్ళి చూశాను. కుళ్ళిన వాసన వస్తోంది. బైటికితీసిన తర్వాత రామారావు శవాన్ని గుర్తుపట్టి గొల్లుమన్నాడు. అది తన తండ్రిదే అని ఏడుస్తూ చెప్పాడు.

రామారావు ఏడుస్తుంటే నాకు సానుభూతి కలగడం లేదు. ప్రతాపరాయుడు చెప్పిన విషయాలు గుర్తు కొచ్చాయి. ఒకవేళ కొడుకే తండ్రిని చంపి నాటకం ఆడుతున్నాడేమో అనిపించింది. ఈ రోజుల్లో కొడుకులు తండ్రిని చంపడం అనేది సర్వసామాన్యమైన విషయమై పోయింది. నా సర్వీసులో ఇటువంటివి లెక్కలేనన్ని చూశాను.

కాసేపు అతన్ని ఏడవనిచ్చి భుజంతట్టి "విచారించకు? ఎందుకు జరిగింది ఇలా? మీ ఇంట్లో ఏవైనా గొడవలు జరిగాయా?" అన్నాను.

"గొడవలు ఏం లేవు సార్! అదంతా మా తమ్ముడివల్ల వచ్చింది?" అన్నాడు కళ్ళు తుడుచుకుంటూ.

"ఏమిటి?"

రామారావు చెప్పుకొచ్చాడు. అతని తమ్ముడు లక్ష్మణ రావట. బి. ఏ. ప్యాసై ఇంట్లో వున్నాడట. చదువుకునే రోజుల్లోనే ఎవరో మాలవాళ్ళ అమ్మాయిని ప్రేమించాడట. ఆమెనే పెళ్ళి చేసుకుంటానని పట్టుబట్టాడట. అవతల ఎవరో ఏభై వేలు కట్నం ఇస్తానని తిరుగుతున్నారట. వాళ్ళ నాన్న ఈ సంబంధం చేసుకోమని తిడుతున్నాడట. కాని తమ్ముడు వినడంలేదట. ఇంట్లో ప్రతి రోజూ ఇదే గొడవట.

"మరి నీ వుద్దేశ్యం ఏమిటి?"

"తన మాట వినలేదని ఆత్మహత్య చేసుకుని వుండొచ్చు!" అన్నాడు రామారావు.

"దానికి ఇంత దూరం రావాలా?" ప్రశ్నించాను.

రామారావు సమాధానం చెప్పలేదు. అసలే దుఃఖంలో వున్నాడుగదా. అది నిజంకానీ, కాకపోనీ అనుకుని నేను రెట్టించి అడగలేదు. నిజం ఈవాళ కాకపోయినా రేపు బైటపడక తప్పదు.

శవ పంచాయితీ జరిపిన తర్వాత శవం హాస్పటల్‌కి పంపాను పోస్ట్‌మార్టమ్ రిపోర్టు కోసం.

అప్పుడు మాత్రం రామారావు ఎంతో రిక్వెస్ట్ చేశాడు. పోస్టుమార్టమ్ కోసం హాస్పటల్‌కి పంపితే శవాన్ని కోస్తారనీ, అదంతా ఎందుకనీ, శవాన్ని ఇచ్చేస్తే అంత్య క్రియలకు ఏర్పాట్లు చేసుకుంటాననీ బ్రతిమాలాడు.

అతను బ్రతిమాలే కొద్దీ నాకు అనుమానం బలపడుతోంది. అదంతా కుదరదు అని చెప్పి స్టేషన్‌కి వెళ్ళిపోయి కూర్చున్నాను.

కొంచెం సేపు కూర్చుని ఆలోచించాను. గోపయ్య ఆత్మహత్య చేసుకోవాలనుకుంటే ప్రక్క వూరుపోయి ఎందుకు చేసుకోవాలి? అందుకు ఎన్నో మార్గాలు వున్నాయి గదా! పోయి పోయి బావిలోనే పడాలా? అదీ నాలుగు మైళ్ళు నడచి. నమ్మశక్యంగా లేదు. ఏదో గోల్‌మాల్ వుంది.

ఎఫ్. ఐ. ఆర్. తయారు చేయడంలో నిమగ్నమై పోయాను.

3

పోస్టుమార్టమ్ రిపోర్టు నా అనుమానాన్ని బలపర్చింది. గొంతునులిమి వూపిరి ఆడకుండా చేసినందువలన ప్రాణం పోయిందని డాక్టర్ రిపోర్టులో రాశాడు.

అంటే ఎవరో చంపి ఆ శవాన్ని బావిలో పడేసి చేతులు దులుపుకున్నారన్నమాట.

పోస్టుమార్టమ్ రిపోర్టు ముందు పెట్టుకుని ఆలోచిస్తూ కూర్చున్నాను.

స్టేషన్ ముందు జీప్ ఆగింది.

ఇంకెవరు ప్రతాపరాయుడే. విష్ చేసి కూర్చున్నాడు నవ్వుతూ.

"ఏమిటి దీర్ఘాలోచనలో వున్నారు?"

"గోపయ్యను చంపిన హంతకుడు ఎవరా అని ఆలోచిస్తున్నాను."

ప్రతాపరాయుడు సీరియస్‌గా సిగిరెట్ వెలిగించి రెండు దమ్ములు పీల్చి "మీరేమీ అనుకోనంటే చెప్తాను" అన్నాడు.

"ఏ విషయం?"

"గోపయ్య మర్డర్ కేసు గురించి."

"మీరు క్లూ ఇస్తానంటే వద్దంటానా? సంతోషంగా వింటాను. అనుకోవడం ఎందుకు?"

"మీరు మంచివారు గనుక అలా అన్నారు. కొందరైతే.... పేర్లు చెప్పడం ఎందుకుగాని....ఎవరైనా నా బోటివాడు సలహా చెప్తే వినుకున్నంటారు. ఆ మాత్రం మాకు తెలియదా? నా సర్వీస్ ఎంతో తెలియదా? నీ వయస్సంత వుంది. గుడ్డొచ్చి పిల్లని వెక్కిరించింది అన్నట్లు అర్థం వచ్చేలా మాట్లాడతారు. అందుకని ముందే అలా

అన్నాను." అన్నాడు ప్రతాపరాయుడు.

నేను నవ్వి వూరుకున్నాను.

"నేను చెప్పే విషయాలు విని మీకు చాలా అసహ్యం కలగొచ్చు. కాని నగ్నసత్యం చెప్తున్నాను."

నాలో కుతూహలం హెచ్చింది. ప్రతాపరాయుడు ఆ వూరి వాడు. పైగా గోపయ్యతో అతనికి పరిచయం వుంది. కాబట్టి అతన్ని హత్యచెయ్యడానికి ఎవరికి అవకాశం వుందో తెలిసి వుండొచ్చు. ఆ విధంగా హంతకుడిని పట్టుకోవడానికి ఏదైనా క్లూ దొరకవచ్చు.

"కాంత, కనకం విషయాల్లో మనుష్యులు ఎంత నీచానికి దిగజారతారో వివరించే కథలు మనకు పురాణాల దగ్గర్నుంచి కోకొల్లలుగా వున్నాయి. రోజూ పేపర్లో ఎన్నో వార్తలు చూస్తున్నాం. అటువంటిదే ఈ కథ."

"మీకు కథలు రాసే అలవాటు వుందా?" నవ్వుతూ ప్రశ్నించాను.

ప్రతాపరాయుడు తెల్లబోయాడు.

"ఏం అలా అడుగుతున్నారు?" అన్నాడు.

"ఏం లేదు. మీరు కథ చెప్పే పద్ధతిలో చెప్తుంటే అనుమానం వచ్చింది."

ఆతను నవ్వాడు.

"భలే జోక్స్ వేస్తారే మీరు?"

"అయితే కథలు రాయరన్నమాట."

"చెప్పడం వచ్చుగాని, రాయడం రాదు. వస్తే కట్టలు, కట్టలు రాసి ఎడిటర్లను హడల గొట్టేవాడిని."

"బ్రతికి పోయారు."

"ఎవరు?"

"ఎడిటర్లు."

నవ్వాడు అతను.

"అసలు కథలోకి రండి."

"ఆఁ....వస్తున్నాను. ఊరి చివర మామిడితోటలో గోపయ్య ఇల్లు కట్టించాడు."

"ఆఁ...."

"అందులో ఒక ముండని వుంచాడు."

"ఎప్పుడు?"

"ఎప్పుడో పదేళ్ళక్రితం అనుకుంటాను."

"వూఁ...."

"ఆవిడ పేరు ముత్యాలు, అప్పటికే నలభై దాటి వుంటాయి. దానికొక కూతురు వుంది. ఇద్దరూ తోటలో వుండేవాళ్ళు. గోపయ్యకి అప్పటికే భార్య పోయింది గనుక ఏ గొడవా లేకపోయింది. రెండేళ్ళక్రితం ముత్యాలు చచ్చిపోయింది."

"ఏం పాపం?"

"ఏదో....వుబ్బసం లాంటి రోగం."

"అలాగా!"

"అంతవరకూ బాగానే వుంది. తనకి పుట్టకపోయినా తను వుంచుకున్న దాని కూతురు తనకి ఏ వరస అవుతుంది?"

"వరసైతే కూతురే." అన్నాను.

"అవునా? అది ధర్మం కూడాను. ఆ పిల్లకి ఇరవై ఏళ్లొచ్చాయి. పెళ్ళిచేసి పంపితే ఎంత బాగా వుండేది?"

"బాగానే వుండేది."

"ఆ ముసలాడు పెళ్ళి చెయ్యలేదు. సరిగదా తనే వుంచుకున్నాడు."

"ఈజిట్?"

"యస్సార్! వాడుట్టి నీచుడు."

"మీరు చెప్తుంటే నాకు అసహ్యం వేస్తోంది." అన్నాను.

"ఇంకా అసహ్యకరమైన విషయం చెప్పబోతున్నాను." అన్నాడు అతను సిగరెట్ పీకను బూటు క్రిందవేసి నలుపుతూ.

నాకు ఆశ్చర్యం వేస్తోంది ఆ కథంతా.

"వయస్సులో పిట పిటలాడుతున్న పిల్లను వుంచుకున్నాడేగాని లాభం ఏముంది? ఆ పిల్ల ఈ ముసలాడితో అడ్జెస్టు కాలేకపోయింది."

"వూఁ...."

"గోపయ్య కొడుకు మీకు తెలుసుగా! అదే సార్ రామారావు."

"ఆఁ...."

"వాడు ఆ పిల్లను లోబరుచుకున్నాడు. తండ్రీ కొడుకుతో నాటకం మొదలుపెట్టింది ఆ పిల్ల."

"ఛీ....ఛీ...." అన్నాను. అదంతా వింటుంటే నాకు జుగుప్స కలుగుతోంది. వాళ్ళు మనుష్యులేనా? లేక జంతువులా అనిపిస్తోంది.

"అదే సార్! అసలు గొడవ. ఇటువంటి వ్యవహారాలు ఎన్నాళ్ళు దాగుతాయి. అది తెలిసి గోపయ్య కొడుకుని కొట్టాడు. అది మనసులో వుంచుకుని ముసలాడిని పైకి పంపించి వుంటాడు రామారావు." నెమ్మదిగా అన్నాడు ప్రతాపరాయుడు.

"ఆ పిల్ల పేరు ఏమిటి?"

"అంజమ్మ సార్!"

నేను ఆలోచనలో పడ్డాను. ప్రతాపరాయుడు చెప్పే

దాంట్లో ఎంతో సూక్ష్మమైన పాయింట్ వుంది. వరసా వాయీ లేని వాళ్ళకి తండ్రీ కొడుకు అనే ఆప్యాయతలు ఎక్కడ ఏడుస్తాయి.

తండ్రి తనకు అడ్డం అనుకున్నాడు తొలగించు కున్నాడు. అందుకే ఆ రోజు పోస్టుమార్టం కోసం శవాన్ని హాస్పటల్ కి పంపుతుంటే వద్దని బ్రతిమాలాడు. ఆ నియోజకవర్గం ఎమ్మెల్యేని తీసుకొచ్చి చెప్పించాడు. ఎందుకైనా మంచిదని తన తమ్ముడి కథ ఒకటి చెప్పి వుంచాడు. మనస్సు విరిగి ఆత్మహత్య చేసుకుని వుంటా డులే అని అనుకోవడానికి వీలుంటుందని.

ఆలోచించే కొద్దీ రామారావు దోషిలా కనిపించాడు. కాని కేసు పెట్టడానికి ఆధారాలు కొరకాలి. అది అంత సులభం కాదు.

"మనం ఒకసారి ఆ అంజమ్మను చూడ్డానికి మామిడి తోటకి వెళ్దామా?" అన్నాను.

ప్రతాపరాయుడు ఇబ్బందిగా చూశాడు.

"మనం అక్కడికి వెళ్ళడం ఎందుకు సార్! దాన్నే ఇక్కడికి రప్పించండి!" అన్నాడు.

"వద్దులెండి. అసలే రోజులు బాగాలేవు. ఆడదాన్ని పోలీస్ స్టేషన్ కి తీసుకెళ్తే చాలు. నన్ను రేప్ చేశారు నాయనోయ్ అని గొడవ చేసిందంటే మొదటికే మోసం వస్తుంది. అందులోనూ ఆ అంజమ్మ అసాధ్యురాలని మీరే చెప్తున్నారు." అన్నాను.

"ఆఁ.... అసాధ్యురాలే."

"మనం వెళ్తే కొంత ప్రయోజనం వుంటుంది." అన్నాను.

"ఆఁ.... నేనెందుకు లెండి. బాగోదు. ఆ రామారావు

గాడు ఏడ్చి చస్తాడు. నేనే వాడిని పట్టించానని గొడవ చేస్తాడు. వద్దులెండి. మీ రెళ్ళిరండి." అన్నాడు.

అక్కడికి రావడానికి అతనికి ఇష్టంలేదని వెళ్ళి పోయాడు.

నేను ఇద్దరు కానిస్టేబుళ్ళని తీసుకుని బయల్దేరాను.

4

తోట చుట్టూ సర్కార్ తుమ్మ దట్టంగా పెరిగివుంది. లోపలకి పోవడానికి ఇనుపగేటు వుంది. మా జీప్ వెళ్ళేసరికి మూసి వుంది.

డ్రైవర్ హారన్ కొట్టాక ఎవరో వచ్చి తాళంతీసి గేటు తెరిచాడు.

జీప్ లోపలకు వెళ్ళింది. తోట మధ్యలో వుంది పెంకుటిల్లు.

ఇంకా సూర్యుడు అస్తమించక పోయినా చుట్టూ చెట్లు వుండడంవల్ల చీకటిపడినట్లు వెలుతురు తక్కువగా వుంది అక్కడ.

జీప్ ఆగగానే చుట్ట కాల్చుకుంటూ కూర్చున్న ముసలాడొకడు చుట్ట ఆర్పి దూరంగా పారేసి భయంగా లేచి నిల్చుని చేతులు కట్టుకున్నాడు.

వరండాలో నవారు మంచం వేసి వుంది.

నేను జీప్ దిగాను.

కానిస్టేబుళ్ళు నావంక చూస్తూ నిల్చున్నారు.

"అంజమ్మను పిలవండి." అన్నాను.

"అంజమ్మ ఎక్కడ?" అని మా కానిస్టేబులు ముసలాడిని ప్రశ్నించాడు.

"లోపల వుందయ్యా!" అన్నాడు ముసలాడు.

"పిలువు. అయ్యగారొచ్చారని చెప్పు."

ముసలాడు లోపలకు వెళ్ళాడు.

నేను పరిసరాలు గమనిస్తూ నిల్చున్నాను. ఆ పెంకు టింటికి దక్షిణంగా పశువుల కొట్టం వుంది. అందులో గేదెలు, ఎద్దులు కట్టేసి వున్నాయి. ఆ ప్రక్కనే పెద్ద గడ్డివాము వేసి వుంది.

ముసలాడు అంజమ్మను వెంటబెట్టుకుని వచ్చాడు.

వచ్చి బెరుగ్గా చూస్తూ నిల్చుంది.

ఆమెకు ఇరవై ఏళ్ళుంటాయని ప్రతాపరాయుడు చెప్పాడుగాని అంతకంటే ఎక్కువే అంటే పాతికేళ్ళ వరకూ వుండొచ్చు. లావుగా వుండడంవలన అలా అని పిస్తున్నదేమో మరి. ఏమైనా ఆడవాళ్ళ అసలు వయస్సు కనిపెట్టడం అంత సులభం కాదు.

చామన చాయలో పొట్టిగా ఆకర్షణీయంగా వుంది. పల్చటి నైలెక్స్ చీరలో ఆమె అవయవాలు స్పష్టంగా మగాడిని రెచ్చగొట్టే విధంగా వున్నాయి. ముఖం గుండ్రంగా కరుకుగా వుంది.

ఆమెలో పెళ్ళి కావలసిన పిల్లకుండాల్సిన లక్షణాలు ఏమీ కన్పించలేదు నాకు. ఆ అమాయకత్వం, కన్నెపిల్ల సొగసు అదేం లేదు. చిన్న వయసులోనే మొగుడు పోయి పుట్టింటికి చేరిన దానిలా, జీవితంలో ఆటు పోటులన్నీ అనుభవించిన దానిలా వుంది.

"కూర్చోండయ్యా!" అంది.

నేను వరండాపైకి మెట్లెక్కి వెళ్ళి మంచం మీద కూర్చున్నాను. ఆ మంచంమీద దుప్పటి నలిగి వుంది. అంటే అప్పటివరకూ ఎవరో కూర్చుని లేచి వెళ్ళారన్న మాట. ఎవరై వుంటారు?

అంజమ్మ లోపలనుంచి వచ్చింది. ఆ ముసలాడు

అక్కడ జీతగాడు. మంచంమీద కూర్చోడు. మరి ఎవరు? ఒకవేళ అంజమ్మే కూర్చుని లోపలకు వెళ్ళిందా? జీప్ వస్తున్న చప్పుడు విని వెళ్ళిపోయిందేమో? అంతే అనుకున్నాను.

కాని నా దృష్టి వరండాలో స్తంభం వద్ద ఆగిపోయింది. స్తభం ప్రక్కన బీడీ వెలుగుతోంది. మంచం క్రింద అక్కడక్కడా బీడీ తాలూకు బూడిద గూడా పడివుంది.

అంటే ఎవరో మగవాడు అప్పటివరకూ కూర్చుని వెళ్ళాడు. బీడీ ఇంకా ఆరలేదు. కాబట్టి అతనెవరో చుట్టుప్రక్కలే వుండి వుండాలి. ఒకవేళ ఇంట్లోనే వున్నాడేమో?

నేను అంజమ్మను యెన్నో ప్రశ్నలు అడగాలని మనసులోనే రిహార్సల్స్ వేసుకుని వచ్చాను.

'కాని ఇప్పుడు అక్కడ అప్పటివరకూ కూర్చుని వెళ్ళింది యెవరు?' అనే ప్రశ్న తలెత్తింది.

జీప్ చూసి కంగారుగా వెళ్ళివుంటాడు.

ఎవరు?

ఒకవేళ రామారావు ఏమో?

"ఇంట్లో ఎవరున్నారు?" ప్రశ్నించాను అంజమ్మ ముఖంలోకి పరీక్షగా చూస్తూ.

అంజమ్మ ముఖంలో ఖంగారు కన్పించింది.

"ఎవరూ లేరయ్యా!" అంది.

"ఏయ్! ముసలాడా!" అని పిల్చాను.

"అయ్యా!" అంటూ వచ్చి చేతులు కట్టుకుని నిల్చున్నాడు.

"ఇంట్లో ఎవరున్నారు?"

"ఎవరూ లేరయ్యా! నేనూ, అమ్మాయి తప్ప ఎవరూ

లేరయ్యా!" ఎంతో నమ్మకంగా చెప్పాడు.

అంజమ్మ ముఖం చూశాను.

ఒకవేళ బీడీత్రాగే అలవాటు అంజమ్మకు వుందేమో?

"ఇంట్లో ఎవరన్నా వున్నారేమో వెతకండి" అని మా కానిస్టేబుళ్ళకు ఆర్డర్ చేశాను.

వాళ్ళు ఇంట్లో చొరబడ్డారు.

అంజమ్మ ముఖం వెలవెలా పోయింది. చూస్తుంటేనే తెలిసిపోతోంది ఇంట్లో ఎవడో వున్నాడని.

నేను వూహించినట్లుగానే మా వాళ్ళు ఒకడిని చెరొక రెక్కా పట్టుకొని లాక్కొచ్చారు. వాడు భయంతో గజగజలాడిపోతున్నాడు.

"ఎవరు నువ్వు?"

వాడికి నోటంట మాట రాలేదు. చల్లటి వేళయినా వళ్ళంతా చెమటతో తడిసిపోయింది అతనికి.

"తీసుకెళ్ళి జీప్‌లో వెయ్యండి" అన్నాను.

మా వాళ్ళు లాక్కెళ్ళిపోతుంటే వాడు వాళ్ళిద్దర్నీ విడిపించుకొని వచ్చి నా కాళ్ళమీద పడి "నాకేం తెలియదు సార్!" అన్నాడు ఏడుపుముఖం పెట్టి.

"లే ముందు...." అంటూ నెట్టాను.

కానిస్టేబుళ్ళు వాడిని లాగి నిల్చోబెట్టారు.

"చెప్పు ఎవరు నువ్వు?"

"నా పేరు సత్యం సార్!"

"వూఁ....అయితే ఇక్కడెందుకు వున్నావు?"

"నేను ఇక్కడే పనిచేస్తాను సార్!"

"ఏం పని చేస్తావ్?"

"పాలు వ్యాన్ దగ్గరికి తీసుకెళ్తాను. ఎరువుబస్తాలు లేపడం, తోటకి నీళ్ళు పెట్టించడం....అన్నీ చేస్తాను

సార్!"

"అంటే నువ్వు పెద్దపాలేరువన్న మాట."

"అవును సార్!"

"నీ అవతారం చూస్తే అలా లేదే! తోటకి యజమాని లాగా వున్నావుగాని" అన్నాను. అతను లాల్చీ పైజామా వేసుకుని శృంగార పురుషుడిలా వున్నాడు.

"అంజమ్మ సినిమాకి వెళ్దామంటే బయల్దేరాను సార్!"

ఓహో! అదన్నమాట సంగతి.

"నేను వస్తుంటే ఎందుకు దాక్కున్నావ్ చెప్పు?"

"భయం వేసింది సార్!"

"ఎందుకు?"

"గోపయ్యబాబు చచ్చిపోయాడు గదా!"

"అయితే నీకేం?"

సత్యం మాట్లాడలేదు.

"చెప్పు. గోపయ్య చచ్చిపోతే నీ కెందుకు భయం?"

"ఆయన పెద్దకొడుక్కి నేనంటే కోపం సార్! నా మీద ఏదైనా చెప్పాడేమోనని భయం వేసింది."

"నువ్వంటే అతనికి కోపం ఎందుకు?"

"ఏమో సార్!" అన్నాడు సత్యం.

"సత్యం ఏదో దాచిపెడుతున్నాడని నాకు అనుమానంగా వుంది. రామారావుకి సత్యం అంటే కోపం. ఎందుకు? ఒకవేళ అంజమ్మ విషయంలో కోపమా? వీళ్ళిద్దరికీ సంబంధం వుండివుంటుంది. అందుకు రామారావుకి కోపంగా వుండవచ్చు. అంతే. అంతకంటే యింకేం కారణం వుండివుంటుంది.

అయినా ఈ కేసులో యింతవరకూ యెవర్నీ అరెస్ట్ చెయ్యలేదు. ఈ సత్యంగాడిని అనుమానం మీద అరెస్టు

చేసి లాకప్‌లో పడేస్తే కొంత సంచలనం కలుగుతుంది. తీగ లాగితే డొంక కదలవచ్చు.

"గోపయ్య నీకు ఏమవుతాడు?" ప్రశ్నించాను అంజమ్మను.

"అయ్యసార్!" అంది.

"నువ్వు గోపయ్యకే పుట్టావా?"

"మా అమ్మను వుంచుకున్నాడు."

"మీ అమ్మ పోయిందిగా?"

అవును అన్నట్టు తల వూపింది.

"మరి ఇంకా గోపయ్య దగ్గరే ఎందుకున్నావ్?"

"ఈ తోట మా అమ్మకి రాసిచ్చాడు. మా అమ్మ తర్వాత నాకు వచ్చింది. ఇంకా నాకు ఎవరూలేరు."

"మీ అయ్య బావిలోపడి చచ్చిపోయింది ఎందుకో తెలుసా?"

"తెలీదు."

"నీతో ఏమీ చెప్పలేదా?"

"లేదు."

అంజమ్మ దగ్గర ముఖ్యమైన సమాచారం రాదు. కిటుకంతా సత్యంగాడి దగ్గరే వుంది.

"వాడిని జీప్‌లో పడెయ్యండి" అన్నాను.

సత్యం గిలగిల కొట్టుకుంటుంటే మా వాళ్ళు వ్‌లో పడేశారు.

నేను అంజమ్మలో వస్తున్న రియాక్షన్స్ కనిపెడు తున్నాను.

సత్యాన్ని కానిస్టేబుళ్ళు తీసుకెళ్తుంటే అంజమ్మ ఎంతో బాధపడుతోంది.

సత్యం ఏడుస్తున్నాడు నాకేం తెలియదు బాబోయ్!

అని.

అప్పుడు అంజమ్మ గూడా దుఃఖం ఆపుకోలేక పోయింది.

వీళ్ళిద్దరికీ సంబంధం వుందని నేను రూఢి చేసుకున్నాను.

5

సత్యం, అంజమ్మ పెళ్ళి చేసుకోవాలనుకున్నారు. అందుకు గోపయ్య ఒప్పుకోలేదు. అంజమ్మ గోపయ్య సంరక్షణలో వుంది. అందుకని సత్యం గోపయ్యని గొంతు నులిపి హత్యచేసి పాడుబడిన బావిలో పడేశాడు.

అదీ నా అభియోగం. అలాగే జరిగివుండడానికి అవకాశం వుంది. అందుకే సత్యాన్ని అరెస్టు చేశాను.

మర్నాడు సత్యం చిన్నాన్న వచ్చి బెయిల్ మీద విడిపించుకుపోయాడు.

ఆ తర్వాత కేసు కొంచెం గూడా ముందుకు జరగలేదు. రామారావుమీద మనుష్యుల్ని నిఘా వేసి వుంచాను. అతని తమ్ముడిని ప్రశ్నించాను. తను కులం తక్కువ పిల్లను చేసుకోబోతున్నందుకు తండ్రి బాధపడలేదనీ, కట్నం రాకుండాపోతున్నందుకే బాధపడ్డాడనీ అతను చెప్పాడు.

తన తండ్రి కిందనుంచి పైకి వచ్చినవాడనీ, అతనికి పరువుప్రతిష్టల గురించి పట్టింపులు గూడా లేవనీ, డబ్బే ముఖ్యమని అన్నాడు. పరువుప్రతిష్టలు గౌరవించేవాడైతే మామిడితోటలో ముండని పెట్టుకుని ఎందుకు వున్నాడు? సారాయిత్రాగి రోడ్లమీద ఎందుకు దొర్లుతున్నాడు? అని ప్రశ్నించాడు.

లక్ష్మణరావు చెప్పేదంతాగూడా నాకు సమంజసంగానే అనిపించింది. గోపయ్య డబ్బుమనిషే అని నిశ్చ

యానికి వచ్చాను.

పోతే, తన అన్నకూ అంజమ్మకూ సంబంధం వుందనే సంగతి తను ఏమీ చెప్పలేనన్నాడు. తన తండ్రి మాత్రం ఎప్పుడూ అక్కడే వుండేవాడనీ, అన్న మాత్రం అప్పుడప్పుడూ వెళ్ళివస్తూ వుంటాడనీ చెప్పాడు.

అతనికి వాళ్ళంటే మొదటినుంచీ అసహ్యమట. అందుకే ఆ మామిడితోట వైపు వెళ్ళడట.

లక్ష్మణరావులో నిజాయితీ వుందనిపించింది నాకు. తండ్రి, అన్న అని అభిమానం లేకుండా వాళ్ళ బలహీనతలు విమర్శించాడు.

"మీకు ఎవరిమీదనైనా అనుమానం వుందా?" ప్రశ్నించాను అతన్ని.

"నాలుగేళ్ళ నుంచీ ఇక్కడి పరిస్థితులు నాకు అంతగా తెలియదు. ఈ ఊళ్ళో ఇంటర్ వరకే వుంది. డిగ్రీ చదువుకి పరాయి వూరెళ్ళాను. మా నాన్నకు ఎవరైనా విరోధులున్నారా? అనే విషయం నాకు తెలియదు. మా అన్నయ్యకి పూర్తి వివరాలు తెలుస్తాయి. ఒక్క విషయం మాత్రం చెప్పగలను. ఈ హత్య ఏదో డబ్బు గురించిన లావాదేవీల వలన జరిగింది" అన్నాడు.

"మీ నాన్న ఎవరికైనా పెద్దమొత్తంలో డబ్బు అప్పు యిచ్చాడేమో చూడండి. ప్రామిసరీ నోట్లు వగైరా వుంటాయి" అన్నాను.

"అవన్నీ మా అన్నయ్యకి తెలుసు."

"అడిగి తెలుసుకోండి. మీ నాన్న పోయాడు కాబట్టి రావలసిన బాకీలు రాబట్టుకుని పంచుకునే బాధ్యత మీకు వుందిగదా!"

"అవును." అన్నాడు లక్ష్మణరావు.

ఆ తర్వాత రామారావు ఫోన్ చేసి చెప్పాడు అటు వంటివి ఏమీ లేవని.

ఆ రోజు నే నింకా నిద్ర లేవకముందే హెడ్ కాని స్టేబుల్ హడావుడిగా వచ్చాడు యింటికి.

నేను నిద్రలేచి వళ్ళు విరుచుకుని ఆవలించి "ఏమిటి ప్రొద్దునే?" అన్నాను చిరాకుగా.

"సత్యాన్ని ఎవరో మర్డర్ చేశారు సార్!"

"ఏ సత్యం?"

"మొన్న బెయిల్ మీద రిలీజ్ చేశాం గోపయ్య కేసులో, అతనే సార్!"

"ఆ మామిడితోటలో వుండే వాడేనా?"

"అవును సార్!"

"ఓ మైగాడ్!" అని లేచి పచార్లు చేశాను చిరాకుగా.

"ఎక్కడుంది శవం?"

"ఊరి చివర గంగానమ్మ గుడికి దగ్గర్లో సార్!"

"పద వస్తున్నా!" అన్నాను.

నేను వెళ్ళేసరికి గుంపులుగా వున్న జనం చీలి నాకు దారి యిచ్చారు. అప్పటికే కృష్ణమూర్తి వచ్చివున్నాడు. నన్ను చూసి సెల్యూట్ చేశాడు.

దగ్గర్లోనే గంగానమ్మ గుడి వుంది. ఆ ప్రాంతం అంతా మిట్టపల్లాలతో రాళ్ళ రప్పలతో నిండివుంది. అక్కడక్కడా ఈత చెట్లు ఎక్కువగా వున్నాయి.

సత్యం శవం వెల్లకిలా పడివుంది.

మెడమీద, గుండెల్లో కత్తితో పొడిచిన గాయాలు వున్నాయి. పైజామా, లాల్చీ వేసుకుని వున్నాడు. తెల్లటి బట్టలు రక్తంతో తడిసి అట్టగట్టి వున్నాయి. నేలమీద రక్తం కారి ఎండిపోయి వుంది.

హంతుడు పెనుగులాడిన సూచనలు ఏవీ లేవు.

శవ పంచాయితీ జరిపించి శవాన్ని పోస్టుమార్టమ్‌కి పంపేశాను.

6

సత్యం గొంతుదాకా ఈతకల్లు త్రాగివున్నాడనీ, ఆ నిషాలో వున్నప్పుడే ఎవరో పొడిచి చంపారనీ, ప్రాణం రాత్రి పదింటికి పోయివుంటుందని పోస్టుమార్టమ్ రిపోర్టు.

ఒకటికి రెండు హత్యలు జరగడంతో డియస్పీ అంత క్రితమే ఫోన్ చేసి గొడవ చేశాడు. అంతగా హంతకుల్ని పట్టుకోవడం చేతగాకపోతే క్రైంబ్రాంచి వాళ్ళని పంపుతాననీ ఇన్సల్టింగ్‌గా మాట్లాడాడు.

తొందర్లోనే హంతకుల్ని పట్టుకుని కేసు పెడతానని గట్టిగా చెప్పాను. ప్రమోషన్ వచ్చిన క్రొత్తలోనే హంతకుల్ని పట్టుకోలేక కేసులు క్రైంబ్రాంచికి ట్రాన్స్‌ఫర్ చేస్తే నేను అసమర్ధుడిగా ముద్రపడిపోతుంది.

అదంతా తల్చుకుని నాకు వేడెక్కింది. తీవ్రంగా ఆలోచిస్తూ కూర్చున్నాను.

"గుడ్ మార్నింగ్ సార్!" అంటూ వచ్చి కూర్చు న్నాడు ప్రతాపరాయుడు.

"రండి....రండి" అని ఆహ్వానించాను.

"ఏదో తీవ్రంగా ఆలోచిస్తున్నారే?" అన్నాడు.

"మామూలే. మర్డర్ కేస్."

"అవును ఎవడో మర్డర్ చేయబడ్డాడట గదా! అనుకుంటుంటే విన్నాను. వారం నుంచి వూళ్ళో లేనులెండి. మెడ్రాస్ వెళ్ళాను" అన్నాడు.

"సత్యం అని గోపయ్య మామిడితోటలో పాలేరు. అతన్ని ఎవరో కత్తితో పొడిచి చంపారు!" అన్నాను.

"సత్యమా?"

"అవును. మీరెప్పుడూ చూళ్ళేదా అతన్ని."

ప్రతాపరాయుడు అడ్డంగా తల వూపాడు.

"లేదుసార్. మనకేం పని వాళ్ళతోటి."

నేనూ తల వూపాను.

"ఆ కుర్రాడు మామిడితోటలో వుంటాడా?"

"ఆc....అనుమానం మీద అరెస్టుగూడా చేశాను. వాళ్ళ చిన్నాన్న బెయిల్ మీద విడిపించుకు వెళ్ళాడు."

"ఐ.సీ...." అని ఏదో ఆలోచనలోపడ్డాడు.

"హత్యమీద హత్య."

"ఒకవేళ అతగాడికి ఆ అంజమ్మతో ఏదైనా లౌ ఎఫైర్ వుందేమో?"

"కరెక్ట్."

"అయితే మరి ఇంకేం. అది రామారావుగాడి పనే."

"ఏమిటీ?"

"ఇంకా సందేహం యెందుకు సార్! ముసలోడిని వదిలించుకున్నాడు. ఆ అంజమ్మ, సత్యాన్ని పెళ్ళి చేసుకోవాలని ప్లానులో వుందని పసిగట్టి వుంటాడు. వాడు బ్రతికుంటే తనకి అంజమ్మ లాంగి వుండదు. పైగా తోట అంజమ్మ తల్లిది. తనకు హక్కు లేదు. వాళ్ళిద్దరూ పెళ్ళి చేసుకుంటే తనని గేటుగూడా దాటనివ్వరు. అదంతా ఆలోచించి అంజమ్మకు మగదిక్కు లేకుండా నిర్మూలించాడు. ఇప్పుడు అంజమ్మ తన చెప్పుక్రింద తేలులా పడి వుంటుంది" అన్నాడు ప్రతాపరాయుడు.

నేను అతని మాటలు వింటూ ఆలోచిస్తున్నాను.

"ఏమిటి సార్! పరధ్యానంగా వున్నారు?"

"ఏం లేదు" అన్నాను నవ్వుతూ.

"ఈ రోజు మీరు తప్పకుండా డిన్నర్ కి ఎటెండ్ కావాలి. ఈ సారి తప్పించుకోవడానికి వీల్లేదు" అన్నాడు.

"ఏమిటి విశేషం?"

"విశేషం వుంది."

"ఏమిటో చెప్పండి. ఉట్టినే డిన్నర్లకి రావాలంటే నాకు యెందుకో ఎలర్జి. బంధువుల యిళ్ళకే వెళ్ళను సామాన్యంగా."

"ఈ రోజు నా పుట్టినరోజు."

"హేపీ బర్త్ డే టూ యూ!" అంటూ చేయి కలిపాను.

"థాంక్యూ!" అన్నాడు.

"ముందే చెప్తే బాగుండేదిగా!"

"ఏం లేదు-ఫ్రెండ్స్ ప్రెజెంటేషన్స్ తెచ్చి ఇబ్బంది పెడుతుంటారు. అందుకే నేను సర్ప్రయిజింగ్ గా డిన్నర్ యిచ్చి అప్పుడు చెప్తుంటాను అసలు సంగతి" అన్నాడు.

"అలాగా!" అని తలవూపాను.

"వస్తా సార్! ఇంకా చాలా మందికి చెప్పి రావాలి." అంటూ వెళ్ళిపోయాడు ప్రతాపరాయుడు.

ప్రతాపరాయుడు బర్త్ డే పార్టీకి యెటువంటి ప్రజెంటేషన్ తీసుకెళ్ళాలా? అని ఆలోచిస్తూ కూర్చున్నాను. అతనికి ఇటువంటివి ఇష్టం లేకపోయినా చేతులూపుకుంటూ పార్టీకి వెళ్ళడం నాకూ ఇష్టంలేదు.

యస్.ఐ. కృష్టమూర్తి వచ్చి కూర్చున్నాడు.

"ఏమైంది?" అన్నాను.

"ఆ రోజు, మర్నాడు గూడా రామారావు విజయ

వాడలో వున్నట్లు ఎలిబీ వుంది సార్! కొన్ని షాపుల్లో బిల్స్ కూడా చూశాను. రామారావు సంతకాలు వున్నాయి. వాళ్ళకి రామారావు పర్మినెంట్ కస్టమర్. సులభంగా నే గుర్తుపట్టారు. ఆ రెండు రోజులూ అతను వూళ్ళో లేడు. విజయవాడాలో వున్నాడు."

"రామారావు ఈ హత్యలు స్వయంగా చేస్తాడా? ఎవర్నో వుపయోగించాడు. ఆలోచించు" అన్నాను.

"ఎవర్ని వుపయోగించినా వాళ్ళు తనను బ్లాక్ మెయిల్ చేస్తారని తెలియదా?" ప్రశ్నించాడు కృష్ణమూర్తి.

"అదంతా ముందు ఎవడు ఆలోచిస్తాడు?"

"ఆ మాటా నిజమే అనుకోండి" అన్నాడు కృష్ణమూర్తి ఆలోచనలో పడిపోయి.

"మనం ఒకసారి అంజమ్మను కలుసుకోవాలి" అన్నాను.

"యస్సార్!" అన్నాడు కృష్ణమూర్తి.

కాసేపటికి జీపు సిద్ధమైంది.

అంజమ్మ తోటలోనే వుంది మేం వెళ్ళేసరికి.

నన్ను చూసి నమస్కారం చేసింది.

నేను క్రితంసారి చూసినప్పటిలా లేదు ఆమె. ఒక్కసారిగా ఎంతో మార్పు కనిపించింది. ముఖంలో జీవకళ లేదు. ఎంతో దిగులుగా వుంది.

"సత్యం హత్య ఎవరు చేశారో చెప్పగలవా?" ప్రశ్నించాను.

అంజమ్మ అయోమయంగా చూసింది మా వంక. సత్యం మరణం ఆమెను ఎంతో కృంగదీసినట్లు నేను వూహించగలిగాను.

వరండాలో మంచం మీద కూర్చునివున్నాను నేను.

కృష్ణమూర్తి అక్కడే పచార్లు చేస్తున్నాడు.

అంజమ్మ గుమ్మంలో నిల్చొనివుంది.

మెట్లక్రింద ఒక మధ్యవయస్కుడు మమ్మల్ని గమనిస్తూ కూర్చుని వుండడం నేను గమనించాను. అతనికి నలభై ఏళ్ళు పైనే వుంటాయి. పంచె కట్టుకుని వున్నాడు. వంటిమీద చొక్కా లేదు. తలపాగా చుట్టుకున్నాడు.

అతను అంజమ్మను, మమ్మల్నీ గమనించడం నాకు అనుమానం కలిగింది. అంజమ్మ గూడా అతన్ని అప్పుడప్పుడూ చూస్తూ మాట్లాడుతోంది.

అంజమ్మ తనకు ఏమీ తెలియదనే చెప్తోంది.

"కాఫీ తెస్తాను" అంటూ అంజమ్మ లోపలకు వెళ్ళింది.

"ఎందుకమ్మా! ఇప్పుడేమీ అవసరంలేదు" అన్నాను.

అప్పటికే ఆమె లోపలకి వెళ్ళింది. నా మాట విని నిలబడిపోయింది.

నా కళ్ళల్లోకి చూస్తూ లోపలకి రమ్మని చెయ్యి ఊపింది.

నేను త్రుళ్ళిపడ్డాను ఒక్కసారిగా!

ఏమిటి ఆమె ఉద్దేశ్యం?

నా బుర్రలో ఒక మెరుపు మెరిసింది.

ఆమె ప్రవర్తన నాకు అర్థమైంది.

ఆమె నాతో ఏదో చెప్పదల్చుకుంది. కాని ఆ మెట్ల క్రింద వున్నవాడు ఆమె ఏమీ చెప్పకుండా యెవరో నియోగించిన మనిషి.

వాడి ముందు ఏమీ చెప్పినా వాడు బుర్రలో రికార్డు చేసుకుని అందజేస్తాడు. అది చాలా ప్రమాదమై వుంటుంది. బహుశా ఆమెను గూడా హత్య చెయ్యొచ్చు. అందుకే ఆమె భయపడిపోతోంది.

అదంతా నేను గ్రహించాను.

ఆమె పిలవగానే నేను వెళ్తే ఆమె లోపల్నుంచి నన్ను రమ్మని పిల్చివుంటుందని వాడు గ్రహించవచ్చు.

అందుకే నేనొక ప్లాన్ వేశాను.

"ఇలారా!" అని అతన్ని పిల్చాను.

వచ్చి చేతులు కట్టుకుని నిల్చుని వున్నాడు.

"ఎవరు నువ్వు?" గద్దించాను.

"నా పేరు సాంబయ్య" అన్నాడు.

"ఇక్కడేం చేస్తావ్?"

"తోటలో పని అయ్యా!" వినయంగా అన్నాడు.

"ఈ ఇంట్లో ఎవరున్నారు?"

"అంజమ్మ."

"ఇంకా ఎవరైనా వున్నారా?"

"లేరు అయ్యా!"

"కృష్ణమూర్తీ!"

"సార్!" అన్నాడు కృష్ణమూర్తి.

"ఇంట్లో ఎవరన్నా వున్నారేమో సెర్చి చెయ్యి" అన్నాడు.

"ఎవరూ లేరయ్యా!" అన్నాడు సాంబయ్య.

"నోర్మూయ్! షో...." అన్నాను దబాయించి.

సాంబయ్య తోక ముడుచుకుని దూరంగా పోయాడు.

కాసేపటికి కృష్ణమూర్తి బైటకు వచ్చి "ఎవరూ లేరు సార్!" అన్నాడు.

సాంబయ్యవంక కళ్ళతో చూస్తూ "వుయ్ హేవ్ టూ అరెస్ట్ హిమ్" అన్నాడు.

"వై."

"ఐ విల్ టెల్ యూ లేటర్ సర్" అన్నాడు.

సాంబయ్య మెడమీద చెయ్యిపెట్టి నెట్టుకుంటూ "ఎక్కరా జీపు" అన్నాడు కృష్ణమూర్తి.

సాంబయ్య భయంతో "ఎందుకయ్యా! నేనేం చేశాను?" అన్నాడు.

"ముందు స్టేషన్‌కి రా అక్కడ చెప్తాను" అని జీపు లోకి ఎక్కించాడు సాంబయ్యని.

స్టేషన్‌కి వెళ్ళాక లాఠి చేత్తో పట్టుకుని "మర్యాదగా అంతా చెప్తావా? వడ్డించమంటావా?" అన్నాడు కృష్ణ మూర్తి హుంకరిస్తూ.

"ఏంటయ్యా?.... నేనేం చేశాను?" గజగజలాడి పోతూ అన్నాడు సాంబయ్య.

"నువ్వు తోటలో ఎన్నాళ్ళనుంచి పని చేస్తున్నావు?"

సాంబయ్య నోరు తెరవలేదు;

"నాకు తెలుసురా! నువ్వు రిక్షా తొక్కుతుండే వాడివి. ఎన్నోసార్లు బస్టాండులో చూశాను నిన్ను" అన్నాడు కృష్ణమూర్తి.

"అవునయ్యా! అది మానేసి ఈ మధ్యనే తోటలో పనికి చేరాను."

"ఈ మధ్యనే అంటే ఎన్నాళ్ళ క్రితం జేరావు."

"వారం నుంచి."

"ఎవరు పెట్టారు నిన్ను పనిలో."

"సత్యం."

"సత్యం హత్య చేయబడిన రోజు రాత్రి ఏడింటికి సత్యాన్ని నువ్వు తోటలో నుంచి బైటికి తీసుకెళ్ళావు."

సాంబయ్య ముఖం తెల్లగా పాలిపోయింది.

"సత్యాన్ని ఎవరు పిల్చుకుని రమ్మన్నారు?"

సాంబయ్య మౌనం వహించాడు. వాడు అంత తేలిగ్గా

చెప్పేటట్టులేదు. పెట్టవలసినవి పెట్టాక, వడ్డించినవి తిన్నాక చెప్పక తప్పలేదు.

"గంగులుసార్!" అనేమాట వెలువడింది వాడినోట.

7

జమీందారుగారి భవనంలో ప్రతాపరాయుడి పుట్టిన రోజు వేడుక వైభవంగా జరుగుతోంది.

జమీందారుగారి బంధువులు, ప్రతాపరాయుడి ముఖ్య స్నేహితులు, వూళ్ళోని ఆఫీసర్లు, వర్తక ప్రముఖులతో హాలంతా కళకళ లాడుతోంది.

రిసెప్షన్ వద్ద ఇద్దరు అమ్మాయిలు అప్సరసలవలె అలంకరించుకున్న అందగత్తెలు స్వాగతం చెప్తున్నారు. ఒకామె గులాబీ పువ్వును చేతికి అందిస్తుంటే, మరొకామె వెండి పన్నీరు బుడ్డితో పన్నీరు జల్లుతోంది అతిథులకు.

వాళ్ళకి కొంచెం దూరంలోనే ప్రతాపరాయుడు సినీ హీరోలా మేకప్ చేసుకుని పుట్టినరోజు శుభాకాంక్షలు అందుకుంటూ, చిరునవ్వుతో కరచాలనాలు చేస్తూ సంతోషంగా వున్నాడు.

ప్రతాపరాయుడి తండ్రి నరసింహారాయుడు ఒక సోఫాలో కూర్చుని స్నేహితులతో ముచ్చటలాడుతున్నాడు.

పోలీస్ జీపు ఆగింది.

దూరంనుంచి ఒక చెట్టుక్రింద నిల్చుని నేను అంతా చూస్తూనే వున్నాను.

పోలీస్ జీప్ ఆగగానే చెట్టుక్రిందనుంచి జీపు దగ్గరకి వచ్చాను.

ప్రతాపరాయుడు వెలుతురులో వున్నాడు. నేను చీకట్లో చెట్టుక్రింద నిల్చున్నాను. వెలుతురులో వున్న

వారికి చీకట్లో వున్నవారు కనిపించరు. అలాగే నన్ను అతను చూడలేక పోయాడు.

జీపులోనుంచి కృష్ణమూర్తి దిగాడు.

ఇద్దరం కలసే వెళ్ళాం.

"ఇంత ఆలస్యం చేశారేం?" నవ్వుతూ ప్రశ్నించాడు ప్రతాపరాయుడు.

"మీకు ఎటువంటి ప్రెజెంటేషన్ తెస్తే బాగుంటుందో తేల్చుకోలేక ఇంత ఆలస్యం చేశాను." నవ్వుతూ అన్నాను.

"బలేవారే! ఇంతకీ ఏం తెచ్చారు?" అన్నాడు నవ్వుతూ. మా ఇద్దరి చేతులు ఖాళీగానే వున్నాయి.

నేను చప్పట్లు చరిచాను.

హెడ్ కానిస్టేబుళ్ళు ఇద్దరువచ్చి ప్రతాపరాయుడి చేతులుకు బేడీలు తగిలించారు.

"బాగుందా ప్రజెంటేషన్?"అన్నాడు కృష్ణమూర్తి.

హాలంతా ఒక్కసారిగా నిశ్శబ్దమైపోయింది. అంతా ప్రాణాలు పోయి బొమ్మలైపోయిన వాళ్ళలా చూస్తూ వుండిపోయారు.

ప్రతాపరాయుడి తండ్రి నరసింహరాయుడు మాత్రం పెద్దపులిలా విరుచుకుని పడ్డాడు.

"ఏమిటి మీరు చేసిన పని? ఎవరింట్లో వున్నారో తెలుసుకునే చేస్తున్నారా? ఎంత ధైర్యం మీకు?" అంటూ ఇష్టం వచ్చినట్లు మాట్లాడాడు.

ప్రతాపరాయుడి ముఖం అవమానంతో కోపంతో కందగడ్డలా ఎర్రబడిపోయింది. కళ్ళతోనే నిప్పుల వర్షం కురిపిస్తున్నాడు.

"నరసింహరాయుడుగారూ ఆవేశపడకండి. చట్టానికి

ఎవరూ అతీతులు కాలేరు. జరిగినదంతా దయచేసి మీరు వినాలి. తర్వాత నిజం తెలుసుకుంటారు," అన్నాను.

"ఏమిటూ నిజం?"

"పోలీస్ స్టేషన్‌కి రండి చెప్తాను. ఇక్కడ చెప్తే మీ పరువు పోతుంది." అన్నాను.

"మా ఇంటికొచ్చి నా కొడుకు చేతులకు బేడీలు వేసినప్పుడే పోయింది పరువు." అన్నాడు ఆవేశంతో.

"అలా అనుకుంటే నేను చేసేదేంలేదు. మీరు వస్తే అంతా తెలుస్తుంది," అన్నాడు.

ప్రతాపరాయుడిని లాకప్‌లో పడేసి వచ్చాడు కృష్ణమూర్తి.

నరసింహారాయుడు తెల్లటి మీసాలతో ముసలి సింహంలా నా ఎదురుగా కూర్చుని వున్నాడు. అవమానంతో కళ్ళు ఎర్రబడి వున్నాయి.

అప్పటికి రాత్రి తొమ్మిదైంది.

"చెప్పండి. నేను బెయిల్ మీద వాడిని పిడిపించుకుని పోవాలనుకుంటున్నాను. ఇంతకీ వాడు చేసిన నేరం ఏమిటో?" అన్నాడు.

"హత్య?" అన్నాడు.

నరసింహారాయుడు తన ముందు బాంబు పడినట్లు వులిక్కిపడ్డాడు.

"ఏమిటి మీర నేది?"

"అవునుసార్! సత్యం అనే అతన్ని గంగులు అనే వాడితో హత్య చేయించాడు."

"ఎందుకు చేయించాడు?"

"ఒక హత్యకాదు రెండు హత్యలు చేయించాడు. సత్యంతో గోపయ్యను హత్య చేయించాడు" అన్నాను.

ఆ ముసలి సింహం మతిపోయినట్లు చూశాడు.

"సరే! అదంతా కోర్టులో తేల్తుంది. వాడు నా కొడుకు కాబట్టి ముందు బెయిల్ మీద విడిపించుకుని పోవాలి. లేకపోతే నా ప్రెస్టేజి ఏమైపోతుంది" అన్నాడు.

నేను నవ్వాను.

"మీరు కంగారు పడకండి. అతను మీ కొడుకు కాదు," అన్నాను.

ఈ సారి నరసింహరాయుడు నెత్తిన పిడుగు పడిన వాడిలా దిమ్మెర పోయాడు.

"ఏమిటి సార్ మీర నేది?"

"నిజమే."

"మీకు ఎలా తెలుసు?"

"నిజం తెలుసుకోవడమే మా వుద్యోగం. దోషులను శిక్షించడం మా విధి" అన్నాను.

"వివరంగా చెప్పండి."

"మీ ఏకైక కుమారుడు ప్రతాపరాయుడు."

"అవును."

"అతను ఏడేళ్ళ వయస్సులో వున్నప్పుడు కృష్ణ పుష్కరాలకు వెళ్ళారు మీరు."

"అవును."

"అప్పుడు గోపయ్య మీ దగ్గర నౌకరు. అతన్ని వెంట తీసుకెళ్ళారు."

"నిజమే."

"మీరు స్నానం చేస్తున్నారు. మీ అబ్బాయిని గోపయ్య స్నానం చేయిస్తున్నాడు. మీ అబ్బాయి కొంచెం ముందుకు వెళ్ళి మునిగిపోయాడు."

"ఆc...."

"అవును. అప్పుడు గోపయ్య సమయస్ఫూర్తితో వ్యవహరించాడు. ఒడ్డుకెళ్ళి బట్టలు ఇసుకలో కప్పెట్టాడు. అతని పులిగోరుపతకం మాత్రం బాడ్లో దోపుకున్నాడు. 'బాబుగారూ!' 'బాబుగారూ!' 'చినబాబుగారూ!' అంటూ అరవసాగాడు. తప్పిపోయినట్లు అందర్నీ నమ్మించాడు. అంతమంది జనంలో ఎక్కడో తప్పిపోయాడని అంతా నమ్మారు. పోలీసు రిపోర్టు ఇచ్చినా మీ అబ్బాయి దొరకలేదు."

"అవును సార్!"

"ఐదేళ్ళ క్రితం మీ అబ్బాయి మీకు దొరికాడు."

"అవునా?"

"అవును."

"పదిహేను సంవత్సరాల తర్వాత మీరు మీ కొడుకుని యెలా గుర్తించారు?"

"చిన్నతనంలో వాడి మెడలో వున్న పులిగోరు పతకం. అందులో వాడి ఫోటోవల్ల గుర్తించాను."

"అతన్ని యెవరు పంపారో గుర్తుందా?"

"ఆఁ....గోపయ్యే."

"అదంతా గోపయ్య నాటకం. మీ కొడుకు పోలికలు వున్న వాడి పేరు చిత్తరంజన్. వాడిది గుంటూరు. అక్కడ వీడిని చూసి గోపయ్య పట్టుకొచ్చాడు - వాడు తన తల్లిని వదిలి వచ్చాడు. జమీందారు కొడుకుని చేసినందుకు తను ఐదు లక్షలు ముట్టజెప్పాలని కండిషన్ పెట్టాడు గోపయ్య. పూరికే వచ్చేదానిలో యెంత యిస్తే మాత్రం నష్టం యేముంది? చిత్తరంజన్ ఒప్పుకున్నాడు. గోపయ్య అతన్ని మీ కొడుకుగా నమ్మించాడు."

నరసింహారాయుడు తెల్లబోయి వింటున్నాడు.

"అతను మీ కొడుకుగా నటిస్తూ గోపయ్యకు చాలా డబ్బు ముట్టజెప్పాడు. కాని గోపయ్య అత్యాశకుపోయి అతన్ని డబ్బుకోసం పీడించేవాడు. అతని పీడ వదిలించు కోవడానికి సత్యం ద్వారా గోపయ్యను చంపించాడు. కేసు వస్తే తను చూసుకుంటానని ధైర్యం చెప్పాడు.

గోపయ్య చచ్చిపోయాక సత్యాన్ని మేము అను మానంమీద అరెస్టు చేశాం. సత్యం భయపడి ఎప్పుడైనా తనమీద చెప్తాడేమోనని జాగ్రత్త కోసం సత్యాన్ని గంగులు అనేవాడితో చంపించాడు. గంగులు డబ్బు తీసుకుని యిటువంటి పనులు చెయ్యడంలో దిట్ట."

నరసింహరాయుడి ముఖం కళ తప్పింది. ఆవేశం నీళ్ళుపోసినట్లు చల్లారిపోయింది.

"గోపయ్య పీడ వదిలించుకోవాలనే ఉద్దేశ్యంతోనే వాడు మాతో స్నేహంగా వుండేవాడు యెందుకైనా మంచిదని."

"మీకు యెందుకు అనుమానం వచ్చింది?" అన్నాడు నరసింహరాయుడు.

"గోపయ్య చనిపోయినప్పుడు సత్యం అనే వాడిని అరెస్టుచేశామని చెప్పినప్పుడు అత నెవరో తెలియదని అన్నాడు. మా అనుమానం గోపయ్య కొడుకు రామా రావు మీదకు మళ్ళేటట్టు కబుర్లు చెప్పేవాడు. ఒకరోజు నేను మీ యింటికి వచ్చాను మీ అబ్బాయి లేనప్పుడు. మనం అప్పుడు మొదటిసారి కలుసుకున్నాం.

"అవును గుర్తుంది."

"ఆ రోజు మీ యింట్లో వున్న గ్రూప్ ఫోటోలలో ఒక దానిలో సత్యం వున్నాడు. నాకు అప్పుడే అను మానం వచ్చింది. తన యింట్లో పనిచేసిన సత్యం అతనికి

యెందుకు గుర్తులేదు? అని ఆలోచించాను. ఆ తర్వాత మాటల సందర్భంలో మీ అబ్బాయి కృష్ణపుష్కరాలలో తప్పిపోయిన సంగతి, ఐదేళ్ళ క్రితం దొరికిన సంగతి చెప్పారు."

"అవును. చెప్పాను."

"ఆ తర్వాత మీ వాడిమీద సి.ఐ.డీ.లను వేసి పాత కథంతా రాబట్టాను" అన్నాడు.

నరసింహారాయుడు గంభీరవదనంతో నా వంక కృతజ్ఞతతో చూశాడు.

—:ఐపోయింది:—